సాక్షి
అనకాపల్లి
సోమవారం । 17 । జూలై । 2023



ద్వాక్రా సభ్యులకు మొక్కలు
గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా ద్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మొక్కలు పంపిణీ చేశారు. 8లో



ఎక్సలెంట్‌గా మానసిక ఆస్పత్రి
అధునాతన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోంది. 8లో



అపూర్వ కలయిక 8లో
దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సదస్సు ఆదివారం ఉత్సాహంగా జరిగింది.



● శాకంబరిగా..

పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారు భక్తులకు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ఆఖరి ఆదివారం కావడంతో వ్యాపారవేత్త మళ్ల జగ్గ అప్పారావు సహకారంతో అమ్మవారి మూలవిరాట్‌ను పలు రకాల పండ్లతో అలంకరించినట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. -అనకాపల్లిటౌన్



● సరదాగా..

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదివారం కుటుంబ సమేతంగా తిక్కవానిపాలెం తీర ప్రాంతాన్ని సందర్శించారు. సింహాద్రి ఎన్టీపీసీ ఏర్పాటు చేసిన అతి పొడవైన జెట్టీపై కొంత సేపు గడిపారు. జెట్టీ సమీపంలో ఏర్పాటు చేసిన పార్క్‌లో కుటుంబ సభ్యులతో కాసేపు గడిపి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం తీరం అందాలను ఆస్వాదించారు. కలెక్టర్ వెంట సింహాద్రి ఎన్టీపీసీ అధికారులు ఉన్నారు. -పరవాడ



● చౌకగా..

తక్కువ ధరకు బియ్యం, కందిపప్పును ప్రజలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పట్టణంలో రైస్ అండ్ దాల్ మర్చంట్స్ ఆధ్వర్యంలో వీటి అమ్మకాలు చేపట్టారు. విక్రయాలను కొప్పాక శ్రీనివాసరావు దుకాణంలో డీఎస్‌వో కె.వి.ఎల్.ఎల్.మూర్తి ఆదివారం ప్రారంభించారు. మార్కెట్లో కిలో కందిపప్పు ప్రస్తుతం రూ.145 ఉండగా ఇక్కడ రూ.137కి, బియ్యం కిలో రూ.52 ఉండగా రూ.46కు వినియోగదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్చంట్స్ సంఘ అధ్యక్షుడు బొడ్డేడ శంకరరావు, కార్యదర్శి గుండా సాయి, కోశాధికారి బి.రామకృష్ణ, సభ్యులు శ్రీధరాల కృష్ణప్రసాద్, డి.వి.రమణ, బి.రాంబాబు, కె.నూకరాజు పాల్గొన్నారు. -అనకాపల్లిటౌన్

న్యూస్‌రీల్

25న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

పరవాడ: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న వెన్నలపాలెం కల్యాణ మండపంలో అనకాపల్లి జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు సబ్ జూనియర్ 9 నుంచి 14 ఏళ్లు, జూనియర్ 14 నుంచి 18 ఏళ్లు, సీనియర్ కేటగిరిలో 18 నుంచి 28 ఏళ్ల వయసు గల బాల బాలికలు అర్హులని తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఆగస్టులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. అక్కడ ప్రతిభ చూపిన వారు ఖేలో ఇండియా పోటీలకు అర్హత సాధిస్తారన్నారని తెలిపారు. పూర్తి వివరాలకు 9701658665 నంబర్‌లో సంప్రదించాలని ఆంజనేయులు కోరారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో శ్రీనుకు బంగారు పతకం



బంగారు పతకం సాధించిన శ్రీను (మధ్యలో ఉన్న వ్యక్తి)

తుమ్మపాల: శ్రీకాకుళం జిల్లా రాజాం జీఎంఆర్ ఐటీలో ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన ఎం.శ్రీను బంగారు పతకం సాధించినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలా, కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. పట్టణంలో ఎస్‌కేపీ జిమ్‌లో కోచ్ వసాది నానాజీ వద్ద శిక్షణ పొందిన శ్రీను మాస్టర్స్ పురుషులు 59 కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించారన్నారు. ప్రస్తుతం శ్రీను వయస్సు 50 సంవత్సరాలని తెలిపారు. శ్రీను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో అనేక పతకాలు సాధించారని, ఇప్పుడు జాతీయ స్థాయిలో విజయం సాధించడం అభినందనీయమన్నారు.

108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గం

తుమ్మపాల: 108 ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పి.కోటేశ్వరరావు, కార్యదర్శిగా కె.శ్రీరామమూర్తి, కోశాధికారిగా జి.సంజీవరావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్‌గా జి.టి.ఎస్.ప్రసాద్, సభ్యులుగా తేజస్విని, టి.రాజు, వి.వి.ఎస్.మూర్తి, ఎస్.సీతారామ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు శ్రీకుమార్ తెలిపారు.


హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న హెచ్‌ఎంల సంఘ సభ్యులు

ఆరిలోవ: రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం సమావేశం ఆదివారం ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడిగా జోగారావు, అధ్యక్షుడిగా ఆర్.సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి.కృష్ణకుమార్, స్టేట్ కౌన్సిలర్లుగా వై.వి.ఎస్.వేణుగోపాల్, కె.రమణ, పి.జ్యోతి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానకార్యదర్శి కృష్ణకుమార్ మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు.

వుషు పోటీల్లో అనకాపల్లి క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన వుషు క్రీడాకారులు

తుమ్మపాల: శ్రీకాకుళంలో ఈ నెల 15,16 తేదీల్లో జరిగిన ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వుషు చాంపియన్‌షిప్ 10వ సబ్‌జూనియర్, 9వ జూనియర్ బాలురు, బాలికల పోటీల్లో పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు పతకాలు సాధించినట్టు కోచ్ దువ్వాడ హరీష్ తెలిపారు. 33 కిలోల విభాగంలో ఎస్.వర్షాక్ బ్రాంజ్, 42 కిలోల విభాగంలో ఎస్.తులసీరామ్ గోల్డ్, 48 కిలోల విభాగంలో బి.దుర్గాప్రసాద్ బ్రాంజ్, 52 కిలోల విభాగంలో ఎం.సన్నికుమార్ గోల్డ్, 70 కిలోల విభాగంలో ఎం.చరణ్‌తేజ గోల్డ్ పతకాలు సాధించారు.

పశు పోషణకు ప్రభుత్వం చేయూత

- 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాల సరఫరా
- జిల్లాకు 43.16 టన్నుల వివిధ రకాల విత్తనాలు మంజూరు
- ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు పంపిణీ



రైతులకు రాయితీ గడ్డి విత్తనాలు అందజేస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

అనకాపల్లి రూరల్: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. సాగుకు పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునేంతవరకూ అండగా నిలుస్తున్న ప్రభుత్వం పశు పోషకులకూ చేయూతనందిస్తోంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పశువుల సంరక్షణ, పాడి రైతులకు ప్రోత్సాహాన్నిచ్చేందుకు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవా వాహనాలను తీసుకొచ్చి గ్రామాల్లో అనారోగ్యానికి గురైన పశువుల వద్దకే సిబ్బంది, పశువైద్యులు వెళ్లి అవసరమైన చికిత్స అందజేసేలా చర్యలు తీసుకుంది. అత్యవసరమైతే పశువులను సంచార వాహనంలో సమీపంలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేసి ప్రాణాలు కాపాడుతున్నారు. పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం వాటి పోషణకోసం పాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పశుపోషకులకు చేయూతగా 75 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలను అందజేయాలని నిర్ణయించింది. పశువులమేతకు అవసరమైన గడ్డి కోసం రైతులు అనేక వ్యయప్రయాసలు పడుతున్న సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో పచ్చ గడ్డి విత్తనాలను పశుపోషకులకు చౌకగా అందుబాటులో ఉంచింది. అనకాపల్లి జిల్లాలో మే నెల నుంచి సెప్టెంబరు వరకూ గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేయడానికి పశుసంవర్ధక శాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. జిల్లాకు 43.16 టన్నుల విత్తనాలు అవసరం. ఆ మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న, మొక్క జొన్న లాంటి పశువుల పెంపకానికి ఉపయోగపడే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. అనకాపల్లి నియోజకవర్గానికి జోవార్, మైజీ విత్తనాలు 2,350 కిలోలు అవసరమని అధికారులు నివేదిక పంపగా ఆ మేరకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు విత్తనాలను మంజూరు చేశారు.

రెండు నెలల్లో పశుగ్రాసం దిగుబడి

వర్షాలు కురుస్తున్న సమయంలో గడ్డి విత్తనాలు పొలంలో జల్లుకుంటే కేవలం రెండు నెలల్లోనే పశుగ్రాసం దిగుబడి అందుబాటులోకి వస్తుంది. 20 సెంట్ల భూమిలో కిలో విత్తనాలు జల్లితే ఆరు నెలలకు 6నుంచి 7 పశువులకు అవసరమయ్యే పశుగ్రాసం లభిస్తుంది. ఈ పశుగ్రాసంలో ఖనిజాలు, లవణాలు, మాంసకృత్తులు పుష్కలంగా ఉంటాయని పశువైద్యులు చెబుతున్నారు. ఇది పశువులకు సమతుల్య ఆహారంగా ఉంటుందని, పశువులు ఆరోగ్యంగా ఉండడంతోపాటు మేతకు పశుపోషకులకు ప్రయాస తప్పుతుందని అధికారులు అంటున్నారు. పచ్చగడ్డి మేత వల్ల పాల దిగుబడి కూడా పెరుగుతుందని రైతులకు సూచిస్తున్నారు.

వివిధ రకాల పశుగ్రాసం దిగుబడులు ఇలా..

జొన్న (సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్) రకం విత్తనాలు ఎకరానికి 15 కిలోలు అవసరం. ఎకరంలో విత్తితే మూడు కోతల్లో 35 నుంచి 40 టన్నుల వరకు పశుగ్రాసం దిగుబడి వస్తుంది. ఈ పశుగ్రాసంలో 7 నుంచి 8 శాతం వరకు మాంసకృత్తులు ఉంటాయి. ఇది కీటకాలు, తెగుళ్లు రాకుండా తట్టుకోగలదు. ఐదు కిలోల విత్తనాల ధర రూ.460 కాగా 75 శాతం సబ్సిడీతో రూ.115 మాత్రమే చెల్లించి రైతులు పొందవచ్చు.

- మొక్క జొన్న రకం విత్తనాలు ఎకరానికి 15 నుంచి 20 కిలోలు అవసరం.12 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది. 5 కిలోల ధర రూ.340 కాగా, 75 శాతం సబ్సిడీ రూ.225 తగ్గింపుతో రైతులు రూ.85 చెల్లిస్తే సరిపోతుంది. దీనిలో మాంసకృత్తులు 11 నుంచి 13 శాతం ఉంటాయి.
- అలసంద విత్తనాలు ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడివస్తుంది. ఎకరం విస్తీర్ణంలో 9 నుంచి 10 కిలోల విత్తనాలు వేయాలి. 3 కిలోల విత్తనాల ధర రూ.295.5 ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం మినహాయిస్తే రైతులు రూ.73.88 చెల్లిస్తే సరిపోతుంది. తెగుళ్లను బాగా తట్టుకునే ఈ రకం పశుగ్రాసంలో మాంసకృత్తులు 18 నుంచి 21 శాతం ఉంటాయి. జీర్ణమయ్యే పదార్థాల శాతం 49 నుంచి 50 శాతంగా అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా జీర్ణమయ్యే పశుగ్రాసంగా దీనిని సూచిస్తున్నారు.
- సజ్జ విత్తనాలు ఎకరానికి 3 నుంచి 4 కిలోలు వేస్తే 10 నుంచి 12 టన్నుల పశుగ్రాసం పొందవచ్చు. ఒక కిలో విత్తనాల ధర రూ.98 కాగా ప్రభుత్వ సబ్సిడీ మినహాయించి కిలోకు రూ.24.5 చెల్లించాలి. ఈ రకం పశుగ్రాసంలో మాంసకృత్తులు 7 నుంచి 10 శాతం వరకు ఉంటాయి.

జిల్లాలో అందుబాటులో ఉన్న పశుగ్రాస విత్తనాలు

రకం	టన్నులు
జొన్న (సీఎస్‌హెచ్ 24 ఎంఎఫ్)	21.55
మొక్కజొన్న	11.25
అలసంద	8.36
సజ్జలు	2



ఆస్ట్రేలియన్ రెడ్ నేపియర్ రకం పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

పశుపోషకులకు మేలు



ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న గడ్డి విత్తనాలు పశు పోషకులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మేత సమస్య తీరడమే కాకుండా పోషణ భారం చాలావరకూ తగ్గుతుంది. ఈ మేత పశువులకు ఆరోగ్యదాయకంగా ఉంటుంది. తెగుళ్లను బాగా తట్టుకునే స్వభావం ఉండటంతో రైతులకు దిగుబడులపై భరోసా ఉంటుంది.
–డాక్టర్ బి.సౌజన్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ,అనకాపల్లి

గడ్డి విత్తనాల్లో మాంసకృత్తులు అధికం



పచ్చి గడ్డి విత్తనాల్లో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. వీటిని పశువులకు ఆహారంగా ఇవ్వడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. పాల దిగుబడి బాగుంటుంది. ప్రభుత్వం 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు అందజేస్తోంది. విత్తనాలకోసం రైతులు తమ పరిధిలో ఉన్న ఆర్బీకేలతో పాటు పశు వైద్యకేంద్రాల్లో కూడా సంప్రదించి భూమి పాసు పుస్తకం నకలు చూపించి తీసుకోవచ్చు.
– డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి, అనకాపల్లి

ఎఫ్‌ఐడీఈ ఓపెన్ చెస్ పోటీల్లో మాడుగుల విద్యార్థుల ప్రతిభ



చదరంగం పోటీల విజేతలను అభినందిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: నెల్లూరులో ఈ నెల 8 నుంచి 9 వరకు జరిగిన అంతర్జాతీయ చదరంగం పోటీల్లో మాడుగుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో న్యూజిలాండ్, అమెరికా, శ్రీలంక, బంగ్లాదేశ్ క్రీడాకారులతో పోటీపడ్డారు. ఆయా దేశాల ఆటగాళ్లతో పోటీపడి 2.5 పాయింట్లు సాధించి, ఎఫ్ఐడీఈ ఐడీ పొందితే తరువాత నుంచి పాల్గొనే ఆటల్లో రేటింగ్ ఇస్తారు. మాడుగుల నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో బొడ్డు ప్రదీప్ 4 పాయింట్లు, మొల్లి రంజిత్‌కుమార్, పినబోయిన యువరాజ్ 3, పినబోయిన ప్రదీప్ చంద్ర 2.5 పాయింట్లు సాధించి ఎఫ్ఐడీఈ ఐడీలను పొంది, ఇతర దేశాల్లో జరిగే టోర్నమెంట్లలో పాల్గొనే అర్హత సాధించారు. వీరు మూడు నెలల పాటు తాళపురెడ్డి నాగచంద్ర దగ్గర శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఈ నలుగురు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందించారు. భవిష్యత్తులో మన దేశం తరపున ఆడి మాడుగులకు అంతర్జాతీయ కీర్తిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ విద్యార్థులకు ముప్ప బుచ్చయ్య చౌదరి, జల్లు కాశీ విశ్వేశ్వరరావు భార్య మీనాక్షి, భారత నిర్మాణ సేవా ట్రస్ట్ సభ్యులు ఆర్థిక సహకారం అందించారు.

బాల్ బ్యాడ్మింటన్ కోచ్ పోలిరెడ్డికి సత్కారం

మహారాణిపేట : బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కోచ్‌గా నియమితులైన బుల్లయ్య కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పి.పోలిరెడ్డిని కలెక్టరేట్ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్(ఎన్ఐసీ) అధికారి భాష, ఏసీపీ శ్రీనివాస్, పోర్టు అధికారి కుమార్‌రాజా తదితరులు ఆదివారం పోర్టు స్టేడియంలో సన్మానించారు. ప్రపంచ ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఇండియన్ యూనివర్సిటీ జట్టుకు కోచ్ కమ్ మేనేజర్‌గా పోలిరెడ్డి నామి నేట్ అయ్యారు.

టమాటాలతో తులాభారం



నూకాంబిక ఆలయంలో టమాటాలతో నిర్వహించిన తులాభారం

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదివారం వినూత్నరీతిలో తులాభారం నిర్వహించారు. వ్యాపారవేత్త మళ్ల జగ్గ అప్పారావు, మోహిని దంపతులు తమ కుమార్తె భవిష్యకు తులాభారం వేస్తామని అమ్మవారికి మొక్కుకున్నారు. టమాటాలు, బెల్లందిమ్మలు, పంచదార 51 కిలోల చొప్పున తులాభారం వేసి అమ్మవారికి సమర్పించారు. వీటితో పాటు జీడిపప్పు,కిస్మిస్‌కూడా అందజేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ అర్చకులు శ్రీను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి రాక

మహారాణిపేట(విశాఖ): ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర సోమవారం విశాఖ రానున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి విశాఖ వచ్చి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకొంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో వడ్డాది, మాడుగుల ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి సాలూరు వెళతారు.

నేడు జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్(విశాఖ) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

విద్యతోనే బీసీలకు గౌరవం

- సీఎం జగన్ గొప్ప సంఘ సంస్కర్త
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో బీసీల అభ్యున్నతి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- ఉత్సాహంగా విశాఖ బీసీ గర్జన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వేదికపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, మంత్రి వేణు గోపాలకృష్ణ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

బీచ్‌రోడ్డు(విశాఖ) : బీసీల అభ్యున్నతి, ఆత్మ గౌరవం అనేది విద్యతోనే సాధ్యమౌతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం 'విశాఖ బీసీ గర్జన' నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఒక సామాజిక వర్గం అభివృద్ధి చెందాలంటే విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. దానికి ప్రభుత్వాల చేయూత కూడా అవసరమన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి బీసీలను పట్టించుకోలేదన్నారు. విద్య,రాజకీయ, ఆర్థికంగా ఎదగాలని చెప్పిన గొప్ప నాయకుడు జగన్ అని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంఘ సంస్కర్త కావడంతో అన్ని వర్గాల అభ్యున్నతి చెందుతున్నాయన్నారు. ముఖ్యంగా బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర రెడ్డి, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీల ఉన్నత చదువుల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. చాలా రాష్ట్రాల్లో తాను పర్యటించానని, బీసీ వర్గాలకు చెందిన పిల్లలు స్కూల్స్‌కు దూరంగా ఉంటున్నారన్నారు. ఏపీలో మాత్రం ప్రతీ ఒక్కరికీ విద్యను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జాతీయ స్థాయిలో బీసీలు సాధించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని వాటిపై పోరాడతామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో బీసీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు.

బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు.. బ్యాక్‌బోన్

బీసీలంటే బ్యాక్‌వార్డ్ క్లాస్ కాదు బ్యాక్‌బోన్ అని చెప్పిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కృష్ణయ్య పేర్కొన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు సముచిత అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. 1997 నుంచి 2004 మధ్య కాలంలో బీసీలను ఉన్నత చదువులకు చంద్రబాబు దూరం చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడంతో లక్షలాది మంది బీసీలు బీటెక్‌లు పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారన్నారు. అదే బాటలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు పక్కి దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహం నుంచి బీసీ నేతలంతా ఆర్.కృష్ణయ్యను ఊరేగింపుగా సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు.కరోనా కాలంలో ఇంటింటికీ వెళ్లి సేవ చేసిన వలంటీర్లకు బీసీ సంక్షేమ సంఘం వందనం చేసింది.

శివారు గ్రామాలకు రహదారుల నిర్మాణమే లక్ష్యం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



జైతవరం వద్ద శిలాఫలకం ఆవిష్కరించి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



తునివలస నుంచి వింటిపాలెం రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

చీడికాడ: శివారు గ్రామాలకు రహదారుల నిర్మాణమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని జైతవరం నుంచి దిబ్బపాలెం వరకు రూ.1.84 కోట్లతో 2.90 కిలోమీటర్ల మేర నిర్మించిన తారు రోడ్డు, తునివలస నుంచి వింటిపాలెం వరకు రూ.1.08 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ఆదివారం ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నా.. చంద్రబాబు నాయుడు ఒక్కరూపాయి కూడా ఇవ్వకపోవడంతో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో అన్ని హామీలను నెరవేర్చగలుగుతున్నానని చెప్పారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాల్లో సైతం తారు, సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించి హామీలను నెరవేర్చినట్టు తెలిపారు. అనంతరం రెండు గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్‌లు కోడూరి సత్యవతి,పడాల హైమవతి,వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు,మండల వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,యువజన అధ్యక్షుడు స్వామినాయుడు, పార్టీ నాయకులు పడాల అప్పలనాయుడు,విస్సారపు నాగేశ్వరరావు,ఈర్లె చైతన్య,నందారపు రమణబాబు,మోసూరి సన్నిబాబు,సుంకర శ్రీను,షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్వాక్రా సభ్యులకు మొక్కల పంపిణీ

చోడవరం: ప్రతీ ఇంటి వద్ద మొక్కలు నాటడంతో పాటు పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలకు ఆదివారం మొక్కలు పంపిణీ చేశారు. మండలంలో 1540 డ్వాక్రా గ్రూపు సభ్యులకు వైఎస్సార్ క్రాంతిపథం (వెలుగు) ఆధ్వర్యంలో 2,865 మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం కనకరాజు, వైఎస్సార్ సీపీ మండల ప్రతినిధులు పల్లా నర్సింగరావు, మొల్లి సోమునాయుడు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సదస్సు ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–79, 1982–83 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులతో పాటు నాడు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో కలిశారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, యోగక్షేమాలు తెలుసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రొంగలి సత్యం, చందక సత్యనారాయణ, బి.ఎ.పాత్రుడు, బి.అప్పారావు, రాజేశ్వరి, ఎం.సూర్యనారాయణ, వి.నాగేశ్వరరావు, కృష్ణ, జి.ఎస్. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నీటిమట్టం తగ్గుముఖం

దేవీపట్నం: రెండు రోజుల నుంచి పెరుగుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం శనివారం రాత్రి నుంచి తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి రెండు అడుగుల మేర తగ్గింది. ఇదేవిధంగా తగ్గుదల కొనసాగితే సోమవారం నాటికి పూడిపల్లి పంచాయతీలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయంలో వరద నీరు తొలగిపోయే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

పండ్ల తోటలతో రైతుకు దీర్ఘకాలిక ఆదాయం

పండ్ల మొక్కలు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం బూడి


మామిడి మొక్క నాటుతున్న బూడి

చీడికాడ: రైతుకు వ్యవసాయం కన్నా సుదీర్ఘకాలం ఆదాయం ఇచ్చేవి పండ్ల తోటలేనని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం చీడికాడ మండలం జే.బి.పురంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ముగ్గురు రైతులకు సంబంధించి తొమ్మిదెకరాల్లో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒకే దగ్గర తొమ్మిది ఎకరాల్లో కొబ్బరి, మామిడి, జీడి మొక్కల పెంపకంపై ఆసక్తిగా పరిశీలించారు. రైతులతో కలిసి మొక్క నాటారు. అనంతరం రైతుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, ఆర్బీకేల ఏర్పాటుతో విత్తన, ఎరువుల కష్టాలు తీరాయన్నారు. గత టీడీపీ హయాంలో వీటి కోసం రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేదన్నారు. అయినప్పటికీ విత్తనాలు దొరక్కపోతే బ్లాక్ మార్కెట్‌లో అదనపు ధర చెల్లించి నష్టపోయేవారన్నారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సచివాలయం, వలంటీరు వ్యవస్థ ప్రవేశపెట్టారన్నారు. రెండు నెలల ముందే ప్రణాళికా బద్ధంగా వివరాలు నమోదు చేసి, సీజన్ ప్రారంభం కాగానే రైతుకు తమ గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారన్నారు. సీఎం దార్శనికతకు ఇది నిదర్శనమన్నారు. అనంతరం రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది చొరవతో ఈ ఏడాది మండలంలోని 89 మంది రైతులకు సంబంధించి 52 ఎకరాలకు 3,780 రైతులు కోరిన వివిధ రకాల పండ్ల మొక్కలు అందించారన్నారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతికొండబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్


రైతు సంఘ అధ్యక్షునిగా ఎన్నికైన మహేష్‌ను సత్కరిస్తున్న ప్రసాద్ తదితరులు

మునగపాక: రాజకీయాలకు అతీతంగా సేవలందించేలా రైతు సంఘం పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. మునగపాక రైతు సంఘానికి రాష్ట్రంలోనే గుర్తింపు ఉందన్నారు. స్థానిక రాహుల్ గాంధీ కల్యాణమండపంలో ఆదివారం రైతుసంఘం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఆర్బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. కౌలురైతులకు కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేస్తోందని తెలిపారు. రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ–పంట నమోదుతో పాటు స్థానికపశువుల ఆస్పత్రిలో అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, రైతుసంఘ మాజీ అధ్యక్షుడు పాలిమేర గణేష్,పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,మాజీ చైర్మన్ దాడి ముసిలినాయుడు,సర్పంచ్ దిమ్మల అప్పారావు,మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు,ఎంపీటీసీ సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

రైతు సంఘ అధ్యక్షునిగా మహేష్

రైతుసంఘ నూతన అధ్యక్షుడిగా ఆడారి మహేష్, ఉపాధ్యక్షులుగా దాడి శివ, ఆడారి శ్రీకాంత్, కార్యదర్శిగా విల్లూరి నూకనరసింగరావు,సహాయ కార్యదర్శిగా ఆడారి లక్ష్మణరావు, కోశాధికారిగా ఆడారి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ప్రసాద్ ఘనంగా సత్కరించారు.

మహిళా సంక్షేమమే సీఎం ధ్యేయం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్


ప్రసాద్‌ను సత్కరిస్తున్న మహిళా నేతలు

మునగపాక: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఆదివారం అనకాపల్లి, పాయకరావుపేట నియోజకవర్గాల నుంచి పార్టీ మహిళా నేతలు ఆయన్ను కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన సాగుతుందన్నారు. పార్టీలో చురుగ్గా పాల్గొనే మహిళలకు కార్యవర్గాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడం ద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతోపాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్ జనపరెడ్డి శేషారత్నం, నామవరం పీఏసీఎస్ అధ్యక్షురాలు కె.సుందరలత, అనకాపల్లి ఏఎంసీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఎం.శోభ పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత పవన్‌కు లేదు

సినీ నటుడు జోగినాయుడు


మాట్లాడుతున్న సినీ నటుడు జోగినాయుడు

నర్సీపట్నం: ఆంధ్రుల అభిమాన నేత సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని జనసేన నేత పవన్‌కల్యాణ్ ఏకవచనంతో సంబోధించటం తగదని ఏపీ క్రియేటివ్ అండ్ కల్చర్ కమ్యూనికేషన్ కల్చర్ హెడ్, సినీ నటుడు జోగినాయుడు పేర్కొన్నారు. మున్సిపాలిటీ 7వ వార్డు గడపగడప కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌తో కలిసి పాల్గొన్నారు. తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కు ప్రజాభిమానం ఏమాత్రం లేదన్నారు. జనసేన పార్టీకి గత అసెంబ్లీ ఫలితాలు కంటే ఈసారి దారుణమైన ఫలితాలు వస్తాయని జోష్యం చెప్పారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కోట్లాది రూపాయలు తీసుకుంటున్న పవన్ కల్యాణ్ సినీ ఇండస్ట్రీకి చేసిందేమి లేదన్నారు. రాష్ట్రాన్ని ఏమి ఉద్ధరించడానికి వచ్చారని ప్రశ్నించారు. ముందు సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు.

పురిటి నొప్పులు.. డోలీ మోతలు


అణుకు గ్రామం నుంచి గర్భిణీని డోలీలో తీసుకెళ్తున్న గిరిజనులు

కోటవురట్ల: ఏజెన్సీ ప్రాంతంలోనే కాదు.. మైదాన ప్రాంతాల్లో కూడా కొన్ని చోట్ల డోలీ మోత తప్పట్లేదు. రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల్లో నేటికీ డోలీ మోతే శరణ్యమవుతోంది. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో సుమారు 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. విద్య, వైద్యం కోసం 6 కిలోమీటర్లు రాళ్లతో కూడిన రహదారిలో అవస్థలు పడాల్సిందే. ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో గూడేనికి చెందిన గర్భిణి తాంబెళ్ల రమ్యకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో హుటాహుటిన డోలీ కట్టి మెయిన్‌రోడ్డు వరకు 6 కిలోమీటర్లు మోసుకెళ్లారు. అక్కడి నుంచి కోటవురట్ల సీహెచ్‌సీకి ఆటోలో తరలించారు. వైద్యురాలు ఝాన్సీరాణి పరీక్షించి సకాలంలో తీసుకొచ్చారని ప్రమాదం లేదని భరోసానిచ్చారు. రాత్రికే కాన్పు అయ్యే అవకాశం ఉన్నట్టు చెప్పారని రమ్య భర్త సూరిబాబు తెలిపారు. గిరిజనులతో పాటు సీపీఎం నేత జి.డేవిడ్‌రాజ్ ఆస్పత్రికి వచ్చి పర్యవేక్షించారు. మెరుగైన సేవలు అందించాలని ఆస్పత్రి సిబ్బందిని కోరారు. కాగా తాంబెళ్ల రమ్యకు ఇది నాలగవ కాన్పు. ఇదివరకు మూడు కాన్పుల్లో ఆడపిల్లలు పుట్టడంతో బాబు కోసం నాలుగో కాన్పు వరకు చూస్తున్నట్టు భర్త సూరిబాబు తెలిపాడు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు


జేసీబీ సాయంతో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగింపు

ఎస్.రాయవరం: ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా, ఆ స్థలంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఆటంకం కలిగిస్తున్నవారిపై స్థానికులు ఆదివారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు చర్యలకు దిగారు. పెద ఉప్పలం గ్రామానికి చెందిన ఓ మహిళ, ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె కుమారుడు కలిసి ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు డిప్యూటీ తహసీల్దార్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీఆర్వో పెంటయ్య, స్థానిక పోలీసులు కలిసి ఆదివారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.ఆక్రమణ భూమిలో జేసీబీతో చదును చేసే పనులు చేపట్టారు. ప్రభుత్వ భూమిలో పాఠశాల భవనం నిర్మాణం చేపడుతుంటే అడ్డుకోవడం ఏమిటని, వెనక్కి తగ్గకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని వీఆర్వో హెచ్చరించారు. ఆక్రమణలకు పాల్పడినట్టు తేలితే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. అయితే ఆ భూమిలో తాము ఎప్పటినుంచో ఉన్నట్టు ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కశింకోట: మండలంలోని బయ్యవరంలో కళాశాల విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారనే అభియోగంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణ రెడ్డి తెలిపారు. వివరాలు. అనకాపల్లిలో కళాశాల నుంచి తన ఇంటికి వెళ్తున్న విద్యార్థినిని బయ్యవరం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన డెకాయిట్ కలగా సన్యాసినాయుడు అడ్డుగా నిలిచి, జడ పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. హత్య కేసులో తాను ఇరికించిన అమ్మాయి తండ్రి గొల్లవిల్లి బాబూరావు జైలుకు వెళ్లడం ఖాయమని బెదిరించాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి బాబూరావును సన్యాసినాయుడు దౌర్జన్యం చేసి కొట్టినట్లు విద్యార్థి తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు సన్యాసినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సన్యాసినాయుడు కూడా ప్రతిగా ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. శనివారం రాత్రి పంచాయతీ కార్యాలయ సమీపంలో కూర్చొని ఉండగా బాబూరావు పాత కక్షలతో తనను దూషించడంతోపాటు చంపుతానని బెదిరించి రాయితోను, చేతితోను బలంగా కొట్టినట్లు సన్యాసినాయుడు ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

అనకాపల్లిటౌన్: మహిళ మెడ నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన వ్యక్తిని న్యాయమూర్తి ముందు ఆదివారం హాజరుపర్చినట్లు ఎస్ఐ సింహాచలం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక మల్లిమణుగులవారివీధిలో నివాసముంటున్న మల్లారెడ్డి ఉమ ఇంటికి ఇటీవల విశాఖకు చెందిన కరణం గణేష్ వెళ్లి ఇల్లు అద్దెకు ఆరా తీశాడు. దీనికి ఉమ తాము కూడా అద్దెకే ఉంటున్నామని, ఓనర్ కింద ఉంటారని చెప్పే సమయంలో బాధితురాలి మెడ నుంచి పుస్తెలతాడు తెంచుకుపోయాడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న గణేష్‌ను విచారించగా చోరీకు పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

'కొత్తపల్లి'లో విదేశీ పర్యాటకులు


కొత్తపల్లి జలపాతానికి వచ్చిన విదేశీ పర్యాటకులు


సందడి చేస్తున్న విదేశీ చిన్నారులు

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం విదేశీ పర్యాటకులు సందడి చేశారు. వీకెండ్ కావడంతో ప్రత్యేక వాహనాల్లో సందర్శకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేశారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. విదేశీ పర్యాటకులకు ఎకో టూరిజం సూపర్‌వైజర్ వంతాల అభి, సిబ్బంది అవసరమైన సహకారం అందించారు.

మున్ముందు ఈ–సిటీ బస్సులే!


విద్యుత్ బస్సు

సాక్షి, విశాఖపట్నం: నగరాల్లో కాలుష్య తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరుగుదల ఇందుకు కారణమవుతోంది. ఇలా కాలుష్యాన్ని వెదజల్లే డీజిల్ వాహనాలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులోభాగంగా కాలుష్య కారక డీజిల్ ఆర్టీసీ బస్సుల స్థానంలో కాలుష్య రహిత విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీ డీజిల్ బస్సులకు బదులు ఎలక్ట్రిక్ (ఈ) బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నాయి.

తొలి దశలో విశాఖకు 100 కేటాయింపు : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి కొత్తగా వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయనుంది. వీటిలో రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖకు 200 వరకు కేటాయించే అవకాశం ఉంది. తొలిదశలో 100 విద్యుత్ బస్సులు కేటాయించాలని గతంలోనే ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. విశాఖలో ప్రస్తుతం 525 సిటీ బస్సులున్నాయి. వాహనాల తుక్కు విధానంలో భాగంగా 15 ఏళ్ల దాటిన బస్సులను సేవల నుంచి తొలగిస్తున్నారు. ఇలా తొలగించిన డీజిల్ బస్సుల స్థానంలో దశల వారీగా ఈ–బస్సులను సమకూరుస్తారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు గర్హనీయం : ఎంపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: వలంటీర్లపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు చేయడాన్ని ఎంపీ సత్యవతి తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆమె వలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధరాత్రి 12 గంటలకు ఒంటరిగా ఆడపిల్ల రోడ్డుపై ఎప్పుడు తిరుగుతుందో అప్పుడే స్వాతంత్య్రం సిద్ధించినట్లు అని చెప్పిన గాంధీజీ కలలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దిశ యాప్‌ను పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకొచ్చింది వలంటీర్లే అన్నారు. ఇంట్లో ఆడపిల్లలు, వితంతులు అదృశ్యమవుతున్నారంటూ లేనిపోని వ్యాఖ్యలు చేసే ముందు సీఎం జగన్ ద్వారా ఏయే చట్టాలు మహిళలకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయో పవన్, చంద్రబాబు గ్రహించాలని కోరారు.

పాడేరు మోదమ్మ సేవలో సినీ డైరెక్టర్


మోదమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం చెక్కును అందజేస్తున్న దర్శకుడు కార్తీక్‌వర్మ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. విరూపాక్ష సినిమా దర్శకుడు దండు కార్తీకవర్మ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో సినిమా సూపర్ హిట్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. దర్శకుడు రూ.10 వేల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

ఎక్స్‌లెంట్‌గా మానసిక ఆస్పత్రి

- మానసిక రోగులకు మెరుగైన వైద్యసేవలు
- సెంటర్‌ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి
- సిద్ధమైన అకడమిక్ బ్లాక్
- నూతనంగా మూడు కోర్సులు


నిర్మించిన నూతన వార్డులు



నూతనంగా నిర్మించిన అకడమిక్‌బ్లాక్

ఏయూక్యాంపస్ : అధునాతన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి మరో ముందడుగు వేస్తోంది. నూతనంగా ఏర్పాటైన సెంటర్ ఆఫ్ఎక్స్‌లెన్స్‌తో సమర్థవంతమైన సేవలను రోగులకు అందించే దిశగా సమాయత్తమవుతోంది. రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తున్న పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి స్వరూపం పూర్తిగా మారి రోగులకు మరింత విస్తృత సేవలు అందించే దిశగా సెంటర్ ఆఫ్ఎక్స్‌లెన్స్ నిలవనుంది. నూతనంగా మూడు కోర్సులతో అదనపు బోధన సిబ్బంది సమకూరనున్నారు.

రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్

కేంద్ర ప్రభుత్వం విశాఖలోని దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని సెంటర్‌ఆఫ్ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రూ.29 కోట్లతో అకడమిక్ బ్లాక్, ఇతర వార్డులను నిర్మించారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతంగా ఉంది. ఇప్పటికే భవనాల నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. కొద్ది రోజు ల్లో ఇవి పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నాయి.

మూడు కోర్సులు ప్రారంభం

అకడమిబక్ బ్లాక్ నిర్మాణం పూర్తికావడంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో భాగంగా క్లినికల్ సైకాలజీ, సైక్రియాట్రిక్ సోషల్‌వర్క్, సైక్రియాట్రిక్ నర్సింగ్ కోర్సులను ప్రారంభించనున్నారు. ఒక్కో కోర్సులో గరిష్టంగా 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. కోర్సుల నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ త్వరలో జరగనున్నాయి. దాదాపు 19 మంది వరకు బోధన సిబ్బంది, క్లినికల్ సైకాలజీ ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రేరియన్, సైక్రియాట్రి సోషల్ వర్కర్ వంటి ఉద్యోగాలు భర్తీ కావాల్సి ఉంది. వీటిని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ భర్తీ చేస్తుంది. ప్రస్తుతం మానసిక ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఎం.డి సైక్రియాట్రీ కోర్సుకు అదనంగా ఈ మూడు కోర్సులు రావడంతో మరింత బలోపేతం కానుంది.

మానసిక రుగ్మతల నివారణకు..

ప్రజల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు, రుగ్మతల నివారణకు ఉపయుక్తంగా నూతన అకడమిక్ బ్లాక్ సేవలు అందించనుంది. దీనిలో ప్రత్యేకంగా డీ అడిక్షన్ విభాగం మత్తుపదార్థాలకు బానిసైన వారికి వైద్య సేవలు అందిస్తారు. ఈ వార్డును 40 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారుల్లో మానసిక సమస్యలు గుర్తించి సత్వరం చికిత్స, ఉపశమనం అందించే విధంగా చైల్డ్ సైక్రియాట్రీ సేవలు 20 బెడ్‌లతో సిద్ధం చేస్తున్నారు. వృద్ధుల్లో వచ్చే మానసిక సమస్యలకు సైతం చికిత్స అందించే విధంగా జిరియాట్రిక్ సైక్రియాట్రీ వార్డ్‌ను ప్రత్యేకంగా 20 బెడ్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. దీని వలన 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు సైతం ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందించే అవకాశం ఏర్పడుతుంది.


మనోవికాస్..నూతన జీవితం

స్వల్పమానసిక సమస్యలు కలిగిన వారికి నూతన జీవితాన్ని అందించడం, సాధారణ జీవితం గడిపే విధంగా మనోవికాస్ విభాగం ఏర్పాటు అవుతోంది. దీనిలో భాగంగా మానసిక రోగులకు ఇది డే కేర్ సెంటర్‌గా నిలుస్తుంది. దీనిలో వారి సామర్థ్యాలకు అనుగుణంగా పేపర్ ప్లేట్లు తయారీ, బొమ్మల తయారీ, టైలరింగ్, క్యాండిల్స్ తయారీ వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు. వాటిని విక్రయించగా వచ్చే లాభంతో కొంత వారికి అందిస్తారు. తద్వారా వీరు సమాజంలో కలవడానికి సాధారణ జీవితం గడపడానికి అవసరమైన నైపుణ్యాలను అందిస్తారు.

పేరుమార్పుకు ప్రతిపాదన

మానసిక ఆస్పత్రి అనగానే ప్రజల్లో ఉండే భయాన్ని రూపుమాపడానికి ఆ పేరును మార్చే ప్రతిపాదన ప్రభుత్వానికి పంపారు. వాల్తేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (విన్స్–ఆర్‌సీ)గా పేరును మార్పు చేయడానికి ప్రతిపాదన చేశారు. మానసిక ఆస్పత్రికి వచ్చామనే భావన రూపుమాపుతూ వారికి స్వాంతన అందించే విధంగా దీనిని తీర్చిదిద్దే దిశగా కృషిచేస్తున్నారు.

పూర్తిస్థాయిలో చికిత్సలు



వివిధ మానసిక సమస్యలతో ఇబ్బందుతు పడుతున్న వారికి అవసరమైన పూర్తిస్థాయి చికిత్స అందించి, వారికి స్వాంతన అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాం. నూతనంగా ఏర్పాటయ్యే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ దీనిని సాకారం చేస్తుంది. మానసిక సమస్యను త్వరితగతిన గుర్తించడం, చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి ప్రక్రియలు అందుబాటులోకి రానున్నాయి.

– డాక్టర్ కేవీ రామి రెడ్డి, సూపరింటెండెంట్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

క్లుప్తంగా

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవం



మోదకొండమ్మ వారిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ జ్యోతి తదితరులు

కశింకోట : కశింకోటలోని పాలాల్లో ఆదివారం మోదకొండమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, రైతు సంఘం అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావుతో పాటు భక్తులు, రైతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అరటి గెలలు, చీరలు, రవికెల రూపంలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

అనకాపల్లిటౌన్ : మండలంలో గోపాలపురం గ్రామంలో సోమవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం పేర్కొన్నారు. అంతకు ముందు రూ.33 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారని ఆయన తెలిపారు. సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంత్రి అమర్‌నాథ్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి ఉత్సవం

కశింకోట : కశింకోటలోని పాలాల్లో పెదపాడు వెళ్లే మార్గంలో వెలసిన సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, రైతులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అరటి గెలలు, చీరలు, రవికెల రూపంలో అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు.

25న జిల్లా స్థాయి యోగాసన పోటీలు

పరవాడ: యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 25న వెన్నలపాలెం కల్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి సీహెచ్ ఆంజనేయులు చెప్పారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ 9 నుంచి 14 ఏళ్లు, జూనియర్ 14 నుంచి 18 ఏళ్లు, సీనియర్ కేటగిరిలో 18 నుంచి 28 ఏళ్ల బాల బాలికలు అర్హులని తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథిమిక్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఆగస్టులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. అక్కడ ప్రతిభ చూపిన కేలో ఇండియా పోటీలకు అర్హత సాధిస్తారన్నా రని తెలిపారు. పూర్తి వివరాలకు 9701658665 నంబర్‌లో సంప్రదించాలని ఆంజనేయులు కోరారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-1
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-2
రంగబలి	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
నాయకుడు	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-3 యూనిట్లు, 'ఎ' నెగెటివ్-1 యూనిట్, 'బి' పాజిటివ్-27 యూనిట్లు, 'బి' నెగెటివ్-1 యూనిట్, 'ఒ' పాజిటివ్-10 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్ 2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 219 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 409 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 9441108144 ఫోన్‌లో సంప్రదించవచ్చు.

దూరాలను దగ్గర చేస్తూ..

- కశింకోట-మునగపాక రోడ్డు నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణాలు
- ఇళ్లకు, మార్కెట్‌కు సులువుగా చేరుతున్న రైతుల వ్యవసాయ ఉత్పత్తులు



మునగపాకకు నిర్మిస్తున్న రోడ్డు



కశింకోట నుంచి పెదపాడు వరకు నిర్మించిన తారురోడ్డు

కశింకోట : కశింకోట నుంచి మునగపాకకు నిర్మిస్తున్న తారు రోడ్డు రవాణాకు సౌకర్యవంతంగా మారింది. ఇప్పటికే దాదాపు సగం మేర రోడ్డు పూర్తి అయింది. మిగిలినది నిర్మాణంలో ఉంది. ఈ రోడ్డు మూడు మండలాల ప్రజలకు ఉపయోగపడుతుండటంతో దూరం తగ్గింది. కశింకోటలో శారదానది అవతల కాశీమదుం గ్రోయిన్ వద్ద నుంచి పెదపాడు మీదుగా మునగపాకకు రూ.5 కోట్లతో ప్రధానమంత్రి సడక్ యోజన కింద సుమారు ఏడు కిలోమీటర్ల పొడవున తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అది సుమారు 3.5 కిలోమీటర్ల పొడవున కశింకోట నుంచి పెదపాడు గ్రామం వరకు ఇప్పటికే పూర్తి అయింది. ఈ ఏడాది జనవరిలో రోడ్డు పూర్తి చేశారు. పెదపాడు నుంచి మరో 3.5 కిలోమీటర్ల మేర మునగపాకకు రోడ్డు నిర్మాణం పని జరుగుతోంది. ఇప్పటికే చదును చేసి మట్టి, మెటల్‌తో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. పూర్తి అయిన తారు రోడ్డు కశింకోట, అచ్యుతాపురం, మునగపాక మండలాల ప్రజలు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి బాగా ఉపయోగపడుతోంది. సాధారణంగా కశింకోట నుంచి అనకాపల్లి మీదుగా మునగపాక వెళ్లాలంటే 11 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. ఇదే ప్రస్తుత రోడ్డు నిర్మాణం పూర్తి అయితే 4 కిలోమీటర్ల మేర దూరం తగ్గనుంది. ఇప్పటికే సగం మేర పెదపాడు వరకు నిర్మించిన తారు రోడ్డు వల్ల అచ్యుతాపురం మండలం హరిపాలెం, తిమ్మరాజుపేట చేరాలంటే ఐదారు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అదే అనకాపల్లి మీదుగా చేరాలంటే సుమారు 14 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో 9 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. పైగా అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు గోతులు పడి అధ్వానంగా ఉంది. దీంతో తిమ్మరాజుపేట, హరిపాలెం, అచ్యుతాపురం సెజ్‌కు వెళ్లి వచ్చే వారు, ద్విచక్ర వాహనదారులు ఇదే రోడ్డుపై సౌకర్యవంతంగా ఉండటం, దూరం తక్కువ కావడం వల్ల కశింకోట, అనకాపల్లి వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే కశింకోట నుంచి అచ్యుతాపురం సెజ్‌కు అనకాపల్లి మీదుగా చేరాలంటే 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అదే కొత్త రోడ్డు ద్వారా అయితే 9 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీంతో ఈ ప్రాంతం నుంచి సెజ్‌కు వెళ్లే ఉద్యోగులు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తున్నారు. పొలాల మీదుగా వేసిన ఈ రోడ్డు వల్ల వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు తెచ్చుకోవడానికి, మార్కెట్‌కు తరలించడానికి కూడా అనువుగా ఉంది. అంతే కాకుండా రహదారి సదుపాయం వల్ల రోడ్డు పక్క భూములకు విలువ పెరుగుతుందంటున్నారు. ఇంకా మిగిలి ఉన్న రోడ్డును ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇది పూర్తి అయితే మునగపాక వెళ్లడానికి ప్రయాణం సౌకర్యవంతం కానుంది.

> **రోడ్డు నిర్మాణంతో ప్రజలకు సౌలభ్యం**
>
> ప్రధానమంత్రి సడక్ యోజనలో రూ.5 కోట్లతో సుమారు ఏడు కిలో మీటర్ల పొడవున కశింకోట నుంచి మునగపాకకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా పెదపాడు వరకు మూడున్నర కిలో మీటర్ల మేర పూర్తి అయింది. ఈ రోడ్డు నిర్మాణం వల్ల కశింకోట-మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాల మధ్య దూరం తగ్గింది. రైతుల వ్యవసాయ ఉత్పత్తులు ఇళ్లకు, మార్కెట్‌కు చేర్చడానికి ఉపయోగపడుతోంది. మిగిలిన పెదపాడు-మునగపాక రోడ్డు నిర్మాణ పనులు ఈ ఏడాది ఆఖరు నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.
>
> –జి. వేణుగోపాలరావు, పంచాయతీరాజ్ డీఈ

డాక్టర్ సూరిశెట్టికి పురస్కారం



ఉత్తమ నంది పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సూరిశెట్టి వెంకట ఆది నాగేశ్వరరావు

కశింకోట : కశింకోటకు చెందిన వాస్తు జ్యోతిష్యుడు డాక్టర్ సూరిశెట్టి వెంకట ఆది నాగేశ్వరరావుకు తెలంగాణకు చెందిన రితిక ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో ఉత్తమ నంది-2023 పురస్కారం లభించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 60 మంది వివిధ రంగాల నిష్ణాతులకు ఆదివారం బిర్లా భాస్కర ఆడిటోరియంలో ఆదివారం ఈ పురస్కారాలు అందజేశారు. దీనిలో భాగంగా నాగేశ్వరరావును 'జ్యోతిర్వాస్తు భాస్కర' బిరుదుతో పాటు నంది పురస్కారం అందించి సత్కరించారు.

మీనామృతంతో అధిక దిగుబడి



మీనామృతం తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న సమాఖ్య అధ్యక్షురాలు అరుణ

కశింకోట : మీనామృతం వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని సుందరయ్యపేట, ఆనందపురం, జి. భీమవరం, తాళ్లపాలెం గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆదివారం పరిశీలించారు. మీనామృతం తయారీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ చేపల వ్యర్థాలు, బెల్లం, కర్ర బొగ్గు పొడి సమపాళ్లలో తీసుకుని తొట్టిలో తడి లేకుండా పొరలుగా వేసి రోజూ ఉదయం, సాయంత్రం ఒకవైపు కలియ తిప్పాలి. 25 రోజుల వరకు మురిగిన తర్వాత దానిలో 250 మిల్లీలీటర్ల ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల అధిక పంట దిగుబడితో పాటు నాణ్యమైన గింజలు సమకూరుతాయన్నారు. ద్రావణం చీడపీడలను కూడా నివారిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



మీనామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



చేపల వ్యర్థాలు, బెల్లంతో తయారు చేసిన మీనామృతం

ఎస్.రాయవరం: ప్రకృతి వ్యవసాయ విధానంతో శ్రేష్టమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని ఎస్ఎఫ్ఏ శ్యామల తెలిపారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

స్థానిక వనరులతో జీవామృతం, సేంద్రియ ఎరువుల తయారీ విధానంలో మెలకువలను వివరించారు. స్థానికంగా లభించే చేపల వ్యర్థాలు, బెల్లం కలిపి 100 లీటర్ల మీనామృతం తయారు చేశారు. మీనామృతాన్ని పంటలకు ఎలా ఉపయోగించాలో వివరించారు. దీంతో ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎల్ 1 రాము, ఎల్ 3 కనకారావు, ఏపీ సీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ



మునగపాక దళితవాడలో పర్యావరణ పరిరక్షణపై గ్రీన్‌క్లబ్ ర్యాలీ

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అనకాపల్లి గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం శివకోటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షులు పీజే నాయుడు, జాతీయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, అంబేడ్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, వార్డు సభ్యులు మార్లపల్లి వరలక్ష్మి, కారు లక్ష్మి, పీఎంసీ చైర్మన్ లక్ష్మి, వైస్ చైర్మన్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు శిబిరానికి చక్కటి స్పందన

మునగపాక: మండలంలోని తోటాడ పాలకేంద్రం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్వర్గీయ దాడి వెంకునాయుడు, సుబ్బాయమ్మల కుమారుడు మాజీ సర్పంచ్ దాడి వీరమహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు వరహాలు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి 88 మంది రోగులు హాజరుకాగా వారిలో 26 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా వీరమహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ నేత్ర సంబంధ ఇబ్బందుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కో ఆర్డినేటర్ అశ్వనీకుమార్, క్యాంప్ మేనేజర్ ఎం.అరుణ్‌కుమార్, నర్సింగ్ స్టాఫ్ రేణుక, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న రైతు రమేష్ రాజ్

సబ్బవరం: పెద్దగెడ్డ ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. ఆరిపాక రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన గెడ్డవాగు వద్ద రైతులు ఆదివారం నిరసన తెలిపారు. అధికారులు ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారన్నారు. గెడ్డవాగులో ఉన్న విలువైన చెట్లను తొలగించిన వారిపై వాల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దీనిపై జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. నిరసన కార్యక్రమంలో రైతులు వి. రమేష్ రాజు, గొర్లి వెంకట రమణ, పెంటకోట రామారావు,ఎ పైడంనాయుడు,దంతులూరి సురేష్ వర్మ,ఆడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మపాలెం మహిళా పోలీస్‌కు సత్కారం



ఉత్తమ ఉమెన్ పోలీస్ జవేరియాను సత్కరిస్తున్న సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో ఓ బాలుడి మిస్సింగ్ కేసును చాకచక్యంగా ఛేదించినందుకు ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో ఉమెన్ పోలీస్‌గా పనిచేస్తున్న షేక్ జవేరియా పోలీసు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. కాగా ఉత్తమ ఉమెన్ పోలీస్‌గా ప్రశంసాపత్రం అందుకున్న జవేరియాను గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.సోమునాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సై పాపినాయుడుకు ఎస్పీ అభినందన



ఎస్సై పాపినాయుడుని ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

యలమంచిలి : యలమంచిలి ఎస్సై కె.పాపినాయుడును అనకాపల్లి జిల్లా ఎస్పీ జి.మురళీకృష్ణ ప్రశంసాపత్రంతో అభినందించినట్టు స్టేషన్ అధికారులు ఆదివారం తెలిపారు. అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన క్రైం మీటింగ్‌లో భాగంగా జిల్లాలో అత్యధిక డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్యపానంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయటంలో పాపినాయుడు ప్రతిభను ఎస్పీ అభినందించి, సత్కరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై పాపినాయుడు మాట్లాడుతూ యలమంచిలి పట్టణ ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా వాహన చోదకులు పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా యలమంచిలి సీఐ షేక్ గఫూర్, రూరల్ ఎస్సై సన్నిబాబు, స్టేషన్ సిబ్బంది ఎస్సై పాపినాయుడుని అభినందించారు.

గిట్టుబాటు ధరలతోనే రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి రూరల్ : పంటలన్నింటికీ గిట్టుబాటు ధర కల్పించి రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వాలు కృషి చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణ కోరారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు ప్రతి ఏటా పెరుగుతూ ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి కార్మిక కర్షక నిలయంలో ఆదివారం జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల మేలు కోసం వెంటనే స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీల అమలు కోసం దేశవ్యాప్తంగా రెండో దశ పోరాటాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన పంటల కనీస మద్దతు ధరల అభిప్రాయ సేకరణ కమిటీ సమావేశానికి రైతు సంఘాలను పిలవకుండా స్టార్ హోటళ్లలో సమావేశం కావడం దారుణమని ఏపీ రైతు సంఘాల నాయకులు ఎ. బాలకృష్ణ, పీఎస్ అజయ్‌కుమార్ ఆరోపించారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకోకుండా పంటల మద్దతు ధర నిర్ణయించడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 16 పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటించి బెల్లం సహా ఇతర పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. ఎరువులు, పురుగు మందులను సహకార సంఘాల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల సాధనకు ఈ నెల 25న మునగపాకలో చేపట్టబోయే జిల్లా సదస్సుకు రైతు సంఘాల నేతలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు అప్పలరాజు, కర్రి అప్పారావు, గండి బోయిన బాబు, పి. శంకర్రావు, నరాల సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ నాయకుడు కె. ఏడుకొండలు, రైతు స్వరాజ్య వేదిక నాయకుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



మహిళలకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట : స్వయం సహాయక సంఘాల మహిళలు పండ్ల మొక్కలను తప్పనిసరిగా పెంచి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. మండలంలోని ఉగ్గినపాలెంలో ఆదివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండ్ల మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వాటి ఫలసాయాన్ని కుటుంబ సభ్యులు సేవించడం వల్ల పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 1560 మొక్కలు అందిస్తున్నామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రీన్ మిలీనియంలో భాగంగా ఒక్కొక్క స్వయం సహాయక సంఘానికి రెండు వంతున కొబ్బరి, మామిడి, జీడిమామిడి, సపోట తదితర పండ్ల మొక్కలు పెంపకానికి పంపిణీ చేస్తున్నామన్నారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, వీవోఏ పద్మావతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



ఎన్టీఆర్ మార్కెట్ నుంచి భీమిలిలో జరిగే సమావేశానికి పయనమైన క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో కొలువైన లక్ష్మీగణపతిని ఎన్టీఆర్ క్రీడామైదానం వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కోటిపల్లి కిశోర్ మాట్లాడుతూ క్లబ్ ద్వారా ఏ చిన్న కార్యక్రమం తలపెట్టిన విఘ్నాలకు అధిపతి అయిన గణపతిని పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విశాఖ జిల్లా భీమిలి బీచ్‌లో జరిగే క్లబ్ సమావేశానికి పయనమయ్యారు. అంతకు ముందు మధ్యాహ్నం క్లబ్ సభ్యులందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బుద్ద అప్పలనాయుడు, కోశాధికారి పొలమరశెట్టి ఓంనమశ్శివాయ, గౌరవాధ్యక్షుడు ఎడ్ల త్రినాథరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గవర కులస్తులను బీసీ-ఏకు మార్చాలి



మాట్లాడుతున్న ఆడారి ఉమాశంకర్

తుమ్మపాల : గవర కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చి, గవర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని అంతర్జాతీయ గౌరీ సేవా సమాఖ్య ఐక్య వేదిక చైర్మన్ ఆడారి ఉమాశంకర్ అన్నారు. పట్టణంలో గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో ఆదివారం గవర కులస్తులు, వక్తల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర కులాన్ని బీసీ-ఏ గా ప్రకటించేలా ప్రతి ఒక్కరు ఉద్యమించాలన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న బొడ్డేడ ప్రసాద్ ఈ విషయమై ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను గవర సంఘాలను ఏర్పాటు జరగాలని, గవర కులస్తుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించుకోవాలన్నారు. వక్తలు కొణతాల రత్నకుమారి, సత్యనారాయణ, కల్కి శ్రీనివాసరావు, ఆడారి అప్పారావు, బుద్దా అప్పలనాయుడు పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గవర కులసభ్యులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా యానాద్రమ్మ పండగ



యానాద్రి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ గోవింద్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర

యలమంచిలి : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ యానాద్రమ్మ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. యలమంచిలి పట్టణం ఏఎస్ఆర్ కాలనీలో ఆదివారం యానాద్రమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్త జనం పోటెత్తారు. ఏటా ఘనంగా నిర్వహించే ఈ పండగ మహోత్సవానికి యలమంచిలి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలి వచ్చి పసుపు, కుంకుమ, చీర రవిక, గాజులు సమర్పించి, అమ్మవారిని పూజించారు. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, యలమంచిలి పట్టణానికి చెందిన వివిధ వార్డుల కౌన్సిలర్లు, భారీ సంఖ్యలో భక్తులు యానాద్రమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కోడి పందాలు ఆడుతున్న 8 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో కోడిపందాల నిర్వాహకులు

మునగపాక: మండలంలోని మెలిపాక సమీపంలో ఏర్పాటు చేసిన కోడిపందాల శిబిరంపై మునగపాక పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కోడిపందాలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ మహ్మద్ ఆలీ షరీఫ్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 8 కోళ్లతోపాటు రూ.12,400 నగదును స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.